(క్రిందటి సంచిక తరువాయి)


"మీ రెండు కలా చికాకు పడతారు? అయినా, మీ దుత్త రాతి గుండె. మాఆడవాళ్ళకులా మీకు ఆత్మీయతలు, అనుబంధాలు ఉండవు. పట్టి మర మనుషులు మీరు! హూఁ! మాశైలూ...మా జయా ...మా మేరీ...నూర్జహాన్, సుజాత...ఎన్ని ఆశలు! ఎన్ని ఆదర్శాలు!..." సరళ గొంతు బొంగురు పోయింది.

రమణ మౌనంగా కూచుని శ్రీమతి కేసి విడ్డూరంగా చూడసాగాడు.

చల్లని చెట్టు నీడ తగలడంతో పాపాయి గూడా కళ్ళు మూసుకుని నిద్రపోయింది.

తల వంచుకుని జీరబోయిన గొంతుకతో సరళ చెప్పుకుపోతోంది-"ఎంత క్లోజ్‌గా ఉండేవాళ్ళం మేము! సెలవుల్లోగూడా ఒకర్ని విడిచి ఒకరు ఉండేవాళ్ళం గాము. ఎవరింటికో ఒకరింటికి అందరమూ కలిసి వెళ్ళేవాళ్ళం! గదిలో ఎవరికీ తనకంటూ సొంత ఆస్తి ఉండేది కాదు. చీరలు, అద్దాలు, దువ్వెనలు, హేరాయిల్, పేస్టు-అన్నీ అందరివీ! మనియార్డరు వస్తే డబ్బు అందరిదీను! ఎవరికి ఉత్తరాలు వచ్చినా అందరూ కలిసి కూచుని చదువుకునే వాళ్ళం! రహస్యాలనేవి లేవు. మాఫ్రెండ్సు ఇళ్ళలోని వ్యక్తులందరూ మాకు సొంత మనుషుల్లాగే అనుకునే వాళ్ళం! మా శైలూకు వాళ్ళ బావ ఉత్తరాలు రాసే వాడు. అవిగూడా అందరూ చదివేవాళ్ళం. దగ్గర కూచుని సమాధానాలు రాయించేవాళ్ళం! 'విజిటింగ్ డే' రోజున అతనొస్తే, అందరమూ పనిగట్టుకుని వెళ్ళి చుట్టూ కూచునే వాళ్ళం! ఒంటరిగా కలవలేదని ఆయన గారు అలిగి కూచుంటే, 'మా ఫ్రెండ్సు కంటే నీ వే మెక్కువలేవోయ్' అనేసి ముఖం ముడుచుకుని కూచుంది శైలూ. వాళ్ళిద్దరి

## మధురాంతకం నరేంద్ర




# మళ్ళీ యెప్పుడో మళ్ళీ యెక్కడో...

కీ రాజీ కుదిర్చేసరికి మాతల ప్రాణం తోకకొచ్చింది. మాజయ ఎప్పుడుపడితే అప్పుడు రాత్రుల్లో గుండె నొప్పి అని లేచి కూచునేది. ఏ అర్థరాత్రో అది లేచి కూర్చుంటే ఇక రాత్రికంతా గదిలో జాగరణే! సపర్యలు చేయడంలో ఒకరితో ఒకరికి పోటీ... సెలవుల్లో ఓసారి నూర్జహాన్ ఆలస్యంగా ఇంటినుంచి వచ్చిందని అలిగి కూర్చున్నా న్నేను. మళ్ళీ మాకు సంధి కుదిరినప్పుడు రూములో ఎంత హడావుడి! మంచాలన్నీ ఒక్కటిగా కలుపుకుని పడుకుని రాత్రంతా కబుర్లు చెప్పుకునేవాళ్ళం. ఎన్ని కబుర్లు ...ఎంత ఆనందం!...గోల్డన్ డేస్...అవి బంగారు రోజులు."

గొంతు బొంగురు పోవడంతో కాస్సేపు మౌనంగా ఉండిపోయిన సరళ. అయిదు నిమిషాల తరువాత మళ్ళీ చెప్పసాగింది-"చదువులయిపోయాక గూడా సంవత్సరాని కొకసా రయినా కలుసుకోవాలని నిర్ణయించుకున్నాము. ఎప్పుడు కలుసుకోవాలి? 'మా జయ కచ్చితంగా ఆగస్టు పదిహేనున పుట్టింది. ఆ తారీఖున అందరూ కలుసుకోవాలని అనుకున్నాము. వాళ్ళింట్లో ఏదో ఫంక్షనుందని ఓ ఆగస్టు పదిహేనున మాసుజాత హాస్టలుకు రాలేదు. జయ ఆ రోజు మంచినీళ్ళు గూడా ముట్టలేదు. మరునాడు సుజాత హాస్టలుకు వచ్చేదాకా అందరం ఉపవాసమే! అంత పట్టుదలన్న మాట! ఫైనలియర్ పరీక్షలయిపోయాక ఇంటికి వెళ్ళిపోతున్నప్పుడు మా ఏడుపుల్ని చూసి అందరూ ఎంత బాధపడిపోయామని!...శైలూ పెండ్లికి ఇన్విటేషను పంపితే, ఇంట్లో పోట్లాడి పెళ్ళి కెళ్ళాను. జయ, సుజాత, మేరీ మాత్రం వచ్చారు. పెళ్ళి పీటల మీద కూర్చుని నూర్జహాన్ రాలేదని శైలూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది. వాళ్ళ బావ పెళ్ళికూతురి ధోరణి చూసి ముఖం ముడుచుకున్నాడు. కాలేజీ వదలి పెట్టిన మరునటి సంవత్సరం ఆగస్టు పదిహేనుకు వాళ్ళింటికి రమ్మని జయ ఉత్తరం రాసింది. మిగిలిన ఫ్రెండ్సు కందరికీ రమ్మని ఉత్తరాలు రాస్తున్నాననీ రాసింది. పదిహేను రానే వచ్చింది. సరిగ్గా ఆ రోజునే పెళ్ళిచూపులు. నా పెళ్ళికి ఇన్విటేషను పంపితే జయ మాత్రమే వచ్చింది. మిగిలిన వాళ్ళ అడ్రసులు గూడా తెలియదు. ఛీ...స్వాతంత్రం లేని ఆడజన్మకంటే, అడవిలో మాసై పుట్టడమే మేలు."

హొటలుకు తిరిగి వచ్చిన తరువాతగానీ సరళ కుదుట పడలేకపోయింది. రమణ రెండు మూడుసార్లు మందలించిన తరువాత తిన్న సాంగ్యం ముగించింది. ఆమెను విషాదయోగంలోంచి ఎలా బయటకు లాగాలో అతడికి తోచలేదు. మధ్యాహ్నం ఓ గంట సేపు రెస్టు తీసుకున్న తరువాత తిరుచానూరుకు బయలుదేరారు. దారి పొడగునా సరళ ముభావంగానే ఉంది.

తిరుచానూరులో పెళ్ళిపందిరిని వెదికి పట్టేసరికి మధ్యాహ్నం నాలుగు గంటలు దాటిపోయింది.



మిత్ర బృందమంతా పామియానా క్రింద కూర్చుని కాఫీలు సేవిస్తూ కనిపించారు.

"అతిథి దేవుడుగా రొచ్చేశారు. ఎక్కడ కుర్చీలు? కాఫీ లెక్కడ? ఎక్కడ పూర్ణకుంభం?" ఓ మిత్రుడు కుర్చీలకోసం కలియ తిరిగాడు.

"పెళ్ళి దగ్గరుండి చేస్తానన్నాడండీ ఈ పెద్దమనిషి. తీరా ఇప్పుడు దయచేస్తున్నాడు..." ఇంకో మిత్రుడు నవ్వుతూనే కోప్పడ్డాడు.

"వీడికయితే మనుషులంటే లక్ష్యం లేదు. నువ్వయినా ముందుగా లాక్కురాగూడదటమ్మా?" పెళ్ళికొడుకు స్వయంగా పరిగెత్తుకొచ్చి పలకరించాడు..

"మా ఆవిడ మీ శ్రీమతిని చూపెట్టమని శత పోరుతోంది. ఇదిగో, శ్రీమతిగారూ, ఇలా రావాలి." మరో మిత్రుడు తన భార్యకోసం చుట్టూ తిరిగి చూశాడు.

సరళను స్త్రీల జట్టుకు అప్పగించిన తరువాత మిత్రులందరూ అలా వాహ్యాళికి బయలుదేరి వెళ్ళిపోయారు. తిరిగి వచ్చేసరికి పెళ్ళికొడుకు ఊరేగుతున్నాడు. భోజనాలు ముగిశాయి. రాత్రంతా పేకాట సాగింది. తెల్లవారుజామున ముహూర్తం. మిత్రులందరూ నిద్ర కళ్ళతో అక్షింతలు విసురుతూండగా మూర్తి గృహస్థు డయ్యాడు. పెళ్ళి ముగిసింది. ఎప్పు డెప్పుడా అనుకొంటున్న మూర్తి పెళ్ళి జరిగిపోయింది. ఎవరి దారిన వారు తిరుగు దారి పట్టారు. మిత్రులందరూ ఒక్కరొక్కరుగా వీడ్కోలు తీసుకోసాగారు.

"ఇటు వైపు రావడమే అరుదు. తిరుమల కెళ్ళాలి. నువ్వూ, చెల్లాయీ మా ఊరుకు తప్పకుండా రావాలి. మా ఆతిథ్యం స్వీకరించాలి. మా పెళ్ళవుతూనే మే మిద్దరమూ మీ ఇంటి కొచ్చాము-గుర్తుందిగదా! నువ్వుగూడా తప్పకుండా రావాలి. ఎదురుచూస్తూ ఉంటాం!" మిత్రుణ్ణి మరీ మరీ హెచ్చరించాడు రమణ.

తిరుచానూరు నించి తిరుపతి కొచ్చిన తరువాత "పాపాయికి పాలున్నాయా? హొటలు కెళ్ళి తెచ్చుకుందామా?" అంటూ అడిగాడు.

"మే మిద్దరమూ ఈ ప్రపంచంలోనే ఉన్నామన్న విషయం ఇప్పటికి జ్ఞాపక మొచ్చిందన్నమాట!..." నిట్టూర్చింది సరళ.

"అర్థాంగివి-నిన్నెలా మరిచిపోతాను? ఏదో చాలా రోజుల తరువాత ఫ్రెండ్సందరూ కలిశాం కదా! అందుకని..." రమణ నవ్వేశాడు.

హొటలు కెళ్ళిన తరువాత రెండు కాఫీలకు ఆర్డరిచ్చాడు. కాఫీ లొచ్చేలోగా పాల సంగతి విచారించడంకోసం కౌంటరు దగ్గరి కెళ్ళాడు. సర్వరు ద్వారా పాల బుడ్డీని లోపలికి పంపిన తరువాత వెనుదిరిగాడు.

రమణ ఒకటి రెండు నిముషాల సేపు తమ సీటును పోల్చుకోలేకపోయాడు. కుర్చీలో కూచున్న వ్యక్తి తన శ్రీమతి అవునో, కాదో అని మళ్ళీ మళ్ళీ పరీక్షించి చూడసాగాడు.

తాను ఆమెను వదలిపెట్టి వచ్చిన కుర్చీలో ఇప్పుడు ఇద్దరు స్త్రీలున్నారు. ఒకరి కౌగిలిలో ఒకరు మిగిలిన ప్రపంచాన్ని మరచిపోయి, పారవశ్యంలో మునిగిపోయి కనిపించారు. ప్రక్కనే సూట్‌కేసు పట్టుకుని ఓ గుండు యువకుడు అచేతనుడై నిలబడిపోయి ఉన్నాడు. ఈ అనుకోని హడావుడి ధాటికి తట్టుకోలేకపోయిన పాపాయి గొంతు చించుకుంటోంది.

"ఏమిటండీ అలా నిలబడిపోయారు? ఇదెవరనుకున్నారు? మా శైలూ...మీ ఆయన్ని మా వారికి పరిచయం చెయ్యవేమే, మొద్దూ! ఏమండోయ్! మీకు చెబుతూ ఉన్నానే శైలూ బావగారని-ఆయనే ఈ పెద్దమనిషి."

తానో కుర్చీలో కూచుని, "ఇలా కూచోండి" అంటూ అతణ్ణి ఆహ్వానించాడు రమణ.

"నమస్తే, సార్! మీ ఆవిడని మా మిసెస్ తలుచుకోని రోజుండదు" అన్నాడు శైలజ బావ.

"నాకు నమ్మకం లేదండీ, అన్నయ్యగారూ! ఇది నన్నెప్పుడో మరిచిపోయింది. పెండ్లికి ఇన్విటేషను పంపితే, ముఖమయినా తిప్పి చూపలేదు. పెళ్ళి రోజున ఎదురుచూసి చూసి నా ముఖం వాచిపోయింది."

"ఆగు, తల్లీ, ఆగు." కోపంగా అడ్డు తగిలింది శైలజ. "పెండ్లికి ఇన్విటేషన్ పంపావా నువ్వు? అబద్ధాలు చెప్పొద్దు. జయావాళ్ళ సిస్టరొకసారి నెల్లూరు బస్‌స్టాండులో కనిపించి చెప్పేదాకా నాకు తెలియనే తెలియదు నీకు మేరేజయిందని..."

"నా చేత్తో అడ్రసులు రాసి పోస్టు చేశాను. మళ్ళీ ఉత్తరాలు కూడా రాశాను అందరికీ."

"మరయితే నే నబద్ధం చెబుతున్నా నంటావా? నీ ఇన్విటేషన్ నా కందలేదు. ఇంతకూ ఏ అడ్రసుకు పంపావు నువ్వు?"

"నెల్లూరు అడ్రసుకే!"

"అదీ సంగతి! మన ఫైనలియర్ అయిపోయిన మూడు నెలలకంతా డాడీకి ట్రాన్స్‌ఫర్ వచ్చింది. కడప వెళ్ళిపోయాం. అయినా, నువ్వు నిజంగా పంపి ఉంటే ఉత్తరాల్ని రీ డైరెక్ట్ చేస్తారు గదా!"

"చూడండి-ఇది నన్ను నమ్మడంలేదు." సరళ ఏడుపుమొహం పెట్టింది.

రమణ బలవంతంగా చిరునవ్వు నవ్వాడు.

"పోనీలేవే-నాకే నీ పెళ్ళి చూసే అదృష్టం లేదని అనుకొంటాను. పోనీలే, ఇప్పటికయినా మా అన్నయ్యను చూపెట్టావు నాకు! చూడండి, అన్నయ్యగారూ! నాకు సొంత అన్నయ్యలు లేరు. దీనికి పెళ్ళయితే అన్నయ్య దొరుకుతాడని కొండంత ఆశ పెట్టుకున్నాను. కానీ, ఇంతవరకూ మిమ్మల్ని నా కంట పడనివ్వలేదు."

"అది సరేగానీ, ఇంతకూ తిరుపతి కెప్పుడొచ్చారు? ప్రోగ్రామ్ ఏమిటి?" అంటూ ప్రశ్నించింది సరళ.

ఏదో మొక్కుబడి చెల్లించుకునే పని మీద నాలుగు రోజుల క్రితం తిరుపతి కొచ్చామని చెప్పాడు శైలజ బావ. ప్రస్తుతం తిరుగు ప్రయాణం సందోహంలో ఉన్నారట! మధ్యాహ్నం నాలుగ్గంటల రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు టిక్కెట్లు రిజర్వు చేసేసుకున్నారట!

"ఇప్పుడు టైమ్ ఒంటి గంట కావస్తోంది. హోర్డి

